# బాంబ్ స్క్వాడ్‌తో రహదారి తనిఖీలు

అన్నవరం ఎస్సై రాజారావు





**చింతపల్లి ఆగస్టు 3 పెన్ పవర్**

చింతపల్లి మండలంలో అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కోరుకొండ రహదారిలో మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం చింతపల్లి మండలంలోని అన్నవరం పోలీసు స్టేషన్ ఎస్సై రాజారావు తమ సిబ్బంది, సీఆర్పీఎఫ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో కలిసి మారుమూల కోరుకొండ రహదారిలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. రహదారికి ఇరువైపులా, నిర్మాణంలో ఉన్న వంతెనల వద్ద, కల్వర్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద ప్రాంతాల్లో అణువణువు క్షుణ్ణంగా గాలింపు చర్యలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

# షూలో కొండచిలువ.. స్నేక్ క్యాచర్ దివ్యకాంత్ కి థాంక్స్





**విశాఖ సిటీ, పెన్ పవర్, ఆగస్టు 03**

విశాఖ వెంకోజీపాలెం లోని ఓ ఇంట్లోకొండ చిలువ కలకలం..అమ్మాయి షూలో ఓ చిన్న కొండ చిలువ కనిపించడంతో కంగారు పడ్డారు.. వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్ కి కాల్ చేసి చెప్పడం తో స్థానికంగా ఉన్న మరో స్నేక్ క్యాచర్ దివ్య కాంత్ అక్కడకు చేరుకుని.షూలో దాక్కుని ఉన్న చిన్న కొండచిలువని పట్టేయడం తో కుటుంబ సభ్యులు.ఊపిరి పీల్చుకున్నారు. స్నేక్ క్యాచర్ వెంటనే స్పందించినందుకు స్నేక్ క్యాచర్ దివ్యకాంత్ కి థాంక్స్ చెప్పారు.

# భీమిలి అభివృద్ధిపై మంత్రి నారాయణతో చర్చించిన గంటా





**విశాఖ సిటీ ,పెన్ పవర్, ఆగస్టు 03**

మున్సిపల్ మంత్రి పి.నారాయణతో ఎం.వి.పి. కాలనీలోని తన నివాసంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం భేటీ అయ్యారు. భీమిలి నియోజకవర్గంలోని వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ కోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని కోరారు. విశాఖలో ఎం.వి.పి.కాలనీ మాదిరిగా భీమిలి – భోగాపురం మధ్య ప్రపంచ స్థాయి మౌలిక సౌకర్యాలతో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా హౌసింగ్ టౌన్ షిప్ అభివృద్ధి చేయాలన్నారు. బీచ్ రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకు కనెక్టింగ్ రోడ్లు,భీమిలి ప్రధాన రహదారుల విస్తరణ, మధురవాడ పీఎం పాలెం, కొమ్మాది జంక్షన్ల వద్ద ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, భీమిలి, తగరపువలసల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మాణం, భీమిలి చిల్లపేట చెరువు అభివృద్ధి తదితర అంశాలను చర్చించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ అభివృ ద్ధి చేయాలని చెప్పారు. సింహాచలం బి.ఆర్.టి. ఎస్. రోడ్డు బాధితులందరికీ స్ఫూర్తిని కమిటీ మినిట్స్ లో పేర్కొన్నట్టు అధిక మార్కెట్ రేటు ధృవీకరిస్తూ టీ.డీ.ఆర్ లను మంజూరు చేయాలన్నారు. భీమిలి మేనిఫెస్టోలో పేర్కొన్న అభివృద్ధి అంశాలు పట్ల మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారు.

# ప్రత్యేక పోలీసు బలగాలతో మావోయిస్టు వారోత్సవాలను నియంత్రించగలిగాం-సీఐ రమేష్



**చింతపల్లి ఆగస్టు 3 పెన్ పవర్**

ప్రత్యేక పోలీసు బలగాలతో సమన్వయం చేసుకొని చింతపల్లి సర్కిల్ పరిధిలో మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, విధ్వంసకర కార్యకలాపాలు చోటు చేసుకోకుండా నియంత్రించగలిగామని సీఐ రమేష్ అన్నారు. స్థానిక ఎస్సైలు అరుణ్ కిరణ్, వెంకటరమణ లతో కలిసి ఆయన మాట్లాడుతూ మావోయిస్టు వారోత్సవాలను నియంత్రించేందుకు ప్రత్యేక పోలీసు బలగాలతో అనునిత్యం తనిఖీలు నిర్వహించామన్నారు. గత నెల 28 నుండి మావోయిస్టులు నిర్వహించ తలపెట్టిన వారోత్సవాలను భగ్నం చేసేందుకు ఇరవై రోజులుగా మన్య ప్రాంతంలో ముమ్మర కూంబింగ్ లు, బాంబ్, డాగ్ స్క్వాడ్ లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. అదే క్రమంలో ముఖ్య కూడళ్లలో ప్రతినిత్యం పహారా నిర్వహించడం జరిగిందన్నారు నేటితో ఈ వారోత్సవాలకు ముగింపు అయినప్పటికీ, తమ శాఖ అప్రమత్తంగానే వ్యవహరిస్తుందన్నారు. అవగాహన లేకుండా మావోయిస్టులకు ఎవరో సహకరించవద్దని ఆయన పిలుపునిచ్చారు. మావోయిస్టులు తమ ఉనికిని చాటు కునేందుకు ఎక్కడా, ఎటువంటి విధ్వసకర సంఘటనలకు పాల్పడకుండా అనుమానిత ప్రదేశాలు, ముఖ్య కూడళ్ళలో తనిఖీలను మరింత పటిష్టం చేస్తామన్నారు. అడుగడుగునా వాహనాలను, వ్యక్తులను తనిఖీ లు చేయడం నిరంతరాయంగా జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యం, విద్యలపై ప్రత్యేక దృష్టి సారించండి

**సప్పర్ల పాఠశాల తల్లిదండ్రుల సమావేశం**

**పంచాయితీ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు3**

విద్యార్థుల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత,విద్య పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయితీ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు అన్నారు.గూడెం కొత్తవీధి మండలంలోని సప్పర్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లితండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ పాఠశాలకు చెందిన విద్యార్థి ఇటీవల తన స్వగ్రామంలో మృతి చెందడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,వార్డెన్ ఉపాధ్యాయులు అందరూ ప్రత్యేక తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.బుజ్జిబాబు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్య విషయాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడడం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవడం చేయాలని ఆయన కోరారు.విద్యార్థులలో ఐక్యత కలిగించి సప్పర్ల ప్రాథమిక పాఠశాల నిర్వహణ సక్రమంగా నడిపించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, సప్పర్ల సచివాలయం సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చట్టాలపై "అవగాహన" లేకుంటే ఎంతో "చులకన"..!

**గంజాయి నాటు సారా జోలికి పోవద్దు...**

**కొయ్యూరు సీఐ వెంకటరమణ మంప ఎస్సై లోకేష్**



**కొయ్యూరు పెన్ పవర్ ఆగస్టు 3**

నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరు ముఖ్యంగా యువత సమకాలీన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లేకుంటే జీవితంలో ఎన్నో అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుందని కొయ్యూరు సీఐ వెంకటరమణ మంప ఎస్సై లోకేష్ కుమార్ అభిప్రాయపడ్డారు. శనివారం మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని మర్రివాడ భూదరాళ్ల పంచాయతీల పరిధిలోని లూసం సాకులపాలెం గ్రామాలను వారు తమ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులతోసీఐ, ఎస్ ఐ లు మాట్లాడుతూ... గంజాయి నాటు సారా తదితర నిషేధిత పదార్థాల జోలికి పోవద్దని హెచ్చరించారు. గంజాయి నాటు సారా సేవించడం రవాణా చేయడం తయారు చేయడం మానుకోవాలని లేకుంటే జీవితాలు నాశనం అవుతాయని వారు హెచ్చరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితాలకు బంగారు బాటలు వేసుకోవాలని ఇతవు పలికారు. రోడ్డు ప్రమాదాలపై కూడా అవగాహన కల్పించారు. యువత విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని వారు సూచించారు. మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వడం నేరమని తెలియజేశారు.కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివాసి దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం దారకొండలో సమావేశం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 3**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9వ తారీఖున దారకొండ పంచాయితీ కేంద్రంలో ఘనంగా నిర్వహించుకోవాలని.. అందుకు స్థానిక ప్రజలు వివిధ పార్టీల నాయకులు ఆదివాసీ నాయకులు, ఉద్యోగ, కార్మిక కర్షకులు అందరూ సమాయత్తం కావాలని ఆదివాసి నాయకులు జగన్, సుందర్రావు, కోటి,కృష్ణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేస్తూఆంధ్రప్రదేశ్ ఆదివాసులు, జేఏసీతో పాటు గిరిజన ఉద్యోగులు, వివిధ సంఘాలు వివిధ పార్టీలో ఉన్న ఆదివాసీ నాయకులు కార్యకర్తలతో పాటు సామాన్య ఆదివాసులు పాల్గొని ఆదివాసి హక్కులు చట్టాలు కాపాడుకోవడానికి గళం విప్పాలని పిలుపునిచ్చారు. ఆదివాసులకు ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలు మన హక్కులు చట్టాలు కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని వివరించారు. ఆగస్టు 9వ తారీఖున దారకొండలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవ వేడుకల నిర్వహణ గురించి సోమవారం అనగా ఆగస్టు 5వ తారీకు ఉదయం 11 గంటలకు దారకొండ హెడ్ క్వార్టర్స్ లో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశానికి దారకొండ దుప్పుల వాడ మరియు గుమ్మరేవుల పంచాయతీల ముఖ్య ఆదివాసీ నాయకులు, ప్రజలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముర్ల నారాయణరావు, బోద రాజు తదితరులు పాల్గొన్నారు.

